# అధిక ఒడుదొడుకులు!




గత వారం మార్కెట్ కోలుకుని సెన్సెక్స్ 215 పాయింట్ల లాభంతో ముగిసింది. ఇన్ఫోసిస్ నాలుగో త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో గత వారం లాభాల స్వీకరణ జరిగింది. అంతర్జాతీయ మార్కెట్లు కూడా దీనికి దోహద పడ్డాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గడం.. ప్రధాన బ్యాంకులు ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించడంతో మార్కెట్ ధోరణి మారింది. ఎగుమతులు లక్ష్యాన్ని మించడం, సాధారణ రుతుపవన వర్షాల అంచనా బుధవారం మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. వారం గరిష్ఠ స్థాయి అయిన 19,696 పాయింట్లను తాకిన సెన్సెక్స్ వారాంతంలో 19,602 పాయింట్ల వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపుదారులు గత వారంలోనూ నికర కొనుగోలుదార్లుగా ఉన్నారు. వీరు రూ.1,921 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. ఫండ్‌లు రూ.218 కోట్ల నికర అమ్మకాలు జరిపాయి. గత వారానికి చివరి ట్రేడింగ్ రోజైన గురువారం షేర్ల లాభ, నష్టాల నిష్పత్తి 1:1 ఉంది. దీన్ని పరిశీలిస్తే.. ప్రస్తుత ఫలితాల కాలంలో చక్రీయ విధానంలో వివిధ రంగాల షేర్ల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

**ఈవారం..:** ఇంట్రాడే ప్రాతిపదికన 200 డీఎంఏ స్థాయి కంటే స్వల్ప దిగువకు సెన్సెక్స్ వచ్చినప్పటికీ.. కీలకమైన స్థాయి పైన ముగిసింది. ప్రస్తుతం ఈ కీలక స్థాయి 19,104 పాయింట్ల వద్ద ఉంది. స్వల్పకాలానికి ఇది మార్కెట్‌కు పటిష్ఠమైన మద్దతు స్థాయిగా కొనసాగవచ్చు. 19,800-20,000 మధ్య సెన్సెక్స్‌కు పటిష్ఠమైన నిరోధం ఎదురవుతోంది. ఈ స్థాయిని ఛేదిస్తే.. మరింత ముందుకు పయనించే వీలుంది. త్రైమాసిక ఫలితాలు దిశానిర్దేశం చేయవచ్చు. డెరివేటివ్‌ల గడువు ముగియనున్నందున ఈ వారం మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనయ్యే వీలుంది.

**ప్రభావితం చూపే అంశాలు:** ఎఫ్ఐఐల నిధులు, ముడి చమురు ధరలు, మార్కెట్‌ను ప్రభావితం చేయొచ్చు. ఆహార ద్రవ్యోల్బణం ఏ మాత్రం తగ్గినా.. దిగువ స్థాయిల వద్ద మార్కెట్‌కు మద్దతు లభించే అవకాశం ఉంది. కొన్ని ప్రధాన బ్యాంకులు అంచనాలకు మించి ఫలితాలను వెల్లడించినందున ఈ రంగానికి చెందిన షేర్లు వెలుగులో ఉండవచ్చు. 2జీ కుంభకోణానికి సంబంధించిన విచారణలు, కొన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలపైన కూడా మార్కెట్ ఒక కన్నేసి ఉంచే వీలుంది. మార్కెట్ దిశను పసిగట్టడానికి అంతర్జాతీయంగా అమెరికాలో ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశం, జీడీపీ గణాంకాలు, కంపెనీల ఫలితాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

**నిరోధ స్థాయిలు: 19,811, 20,000, 20,092 మద్దతు స్థాయిలు: 19,388, 19,242, 19,104**

**ఈ వారం మార్కెట్‌లో అధిక ఒడుదొడుకులకు అవకాశం ఉంది.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*